సాక్షి కామారెడ్డి

గురువారం । 14 । మార్చి । 2024



దాహం తీరేదెట్ల?

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్ పిట్‌లలో నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి.

- 9లో ▸



వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.9 /23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఆరేపల్లి తండా స్కూల్ టీచర్ సస్పెన్షన్

కామారెడ్డి టౌన్: రాజంపేట మండలం ఆరేపల్లి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు బాలాజీపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు డీఈవో రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉపాధ్యాయుడు అనుమతి లేకుండా విధులకు హాజరుకావడం లేదన్న ఆరోపణలున్నాయి. బుధవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆకస్మిక తనిఖీ సమయంలోనూ అందుబాటులో లేరు. దీంతో ప్రాథమిక విచారణ అనంతరం టీచర్ బాలాజీని సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

రేపు మెడికల్ కళాశాలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 ప్రొఫెసర్, 15 అసోసియేట్ ప్రొఫెసర్, 15 అసిస్టెంట్ ప్రొఫెసర్, 15 సీనియర్ రెసిడెంట్ పోస్టుల కోసం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: జిల్లాలోని ఆరు మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలతో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీ అయిన సీట్ల భర్తీ కోసం ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సంబంధిత పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్‌ను గానీ, 99122 44005, 040–23437909 నంబర్‌లలోగానీ సంప్రదించాలని సూచించారు.

'పీఎం సూరజ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి'



కామారెడ్డి క్రైం: ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చ్వల్‌గా పీఎం సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రాజెక్టర్ ద్వారా ఈ కార్యక్రమాన్ని స్థానిక అధికారులు వీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గురించి అధికారులు వివరించారు. ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారి కుటుంబాలకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించేందుకు ఈ పోర్టల్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా మహిళలు తీసుకున్న రుణాల గురించి వివరించారు. రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదిగిన మహిళలు తమ విజయ గాథలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం సుధీర్ భార్గవ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి రజిత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి'



కామారెడ్డి క్రైం: సదాశివనగర్ మండలంలోని మర్కల్ వద్దనున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను కలెక్టర్ బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వనజ, వైస్ ప్రిన్సిపాల్ రేణుక, అడ్మిషన్స్ ఇన్‌చార్జీలు పూర్ణిమ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ ఆర్డీవో బదిలీ

బాన్సువాడ: బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బాన్సువాడకు ఆర్డీవోగా వచ్చిన ఆయన నిర్మల్ ప్రత్యేక డిప్యూ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆదిలాబాద్ మైనార్టీ వెల్ఫేర్ అధికారిగా పనిచేసిన రమేష్ రాథోడ్ బాన్సువాడ ఆర్డీవోగా రానున్నారు.

గొల్ల కుర్మల ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం ముందుకు సాగడం లేదు. మొదటి విడతలో జిల్లాలో 10 వేలకుపైగా యూనిట్లు పంపిణీ చేశారు. రెండో విడత గొర్రెల పంపిణీ నత్తనడకన సాగడంతో ఏళ్లు గడుస్తున్నా లక్ష్యాన్ని చేరుకోలేదు.

– కామారెడ్డి క్రైం



గొర్రెలు రాలే..

- ముందుకు సాగని రెండో విడత గొర్రెల పంపిణీ
- జిల్లాలో 251 మంది గొల్ల కుర్మల ఎదురుచూపులు
- డబ్బులైనా తిరిగివ్వాలంటున్న దరఖాస్తుదారులు

గొల్ల కుర్మల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా గొల్లకుర్మలకు 75 శాతం సబ్సిడీపై గొర్రెల యూనిట్(20 గొర్రెలు, ఒక పొట్టేలు)ను ఇవ్వాలని నిర్ణయించింది. పథకాన్ని రెండు విడతలుగా అమలు చేయాలని నిర్ణయించిన సర్కారు.. తొలి విడతలో జిల్లాలో 10 వేలకుపైగా యూనిట్లు పంపిణీ చేసింది.

పెండింగ్‌లో యూనిట్లు..

రెండో విడతలో కామారెడ్డి జిల్లాకు సంబంధించి మొత్తం 833 మంది గొల్ల, కుర్మలకు గొర్రెల యూనిట్‌లు మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 25 శాతం వాటా ధనం కింద ఒక్కొక్కరినుంచి రూ. 45 వేల చొప్పున డీడీలు కట్టించారు. ఇందులో 582 మందికి గొర్రెల యూనిట్‌లు మంజూరయ్యాయి. మిగతా 251 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కువగా లింగంపేట, గాంధారి, బీబీపేట మండలాలకు చెందిన వారికి గొర్రెల యూనిట్‌లు రావాల్సి ఉంది. వారంతా గత సెప్టెంబర్‌లోనే తమ వాటా ధనాన్ని చెల్లించి యూనిట్ల ఎదురు చూస్తున్నారు. ఒక యూనిట్ విలువ 1.75 లక్షలు ఉండగా పెంపకందారుని వాటా రూ.45 వేలుగా నిర్ణయించారు. యూనిట్‌లు మంజూరు కానివారు తమ వాటా డబ్బులైనా తిరిగి ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు.

పథకానికి అడ్డంకులు..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై దృష్టి సారించింది. గొర్రెల పంపిణీ పథకంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీగా అక్రమాలు జరిగాయని గుర్తించి, విచారణకు ఆదేశించింది. సంచలనం రేపిన ఈ వ్యవహారంలో ఇటీవలే కామారెడ్డికి బదిలీపై వచ్చిన ఓ డివిజన్ స్థాయి అధికారిపై కూడా విచారణ జరుగుతోంది. ఇదిలా ఉండగా కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగిస్తుందో లేదోననే అనుమానాలు సైతం వినిపిస్తున్నాయి. ఒకవేళ కొనసాగించినా మరోసారి అక్రమాలు జరిగేందుకు ఆస్కారం లేకుండా విధివిధానాలు రూపొందించి అమలులోకి తీసుకు రావాలని పలువురు భావిస్తున్నారు.

6 నెలలు దాటింది



గొర్రెల యూనిట్ కోసం రూ. 45 వేలు డీడీ తీశాను. ఆరు నెలలు దాటినా ఇంకా యూనిట్ రాలేదు. చాలాసార్లు అధికారులను కలిశాం. ఏ విషయం స్పష్టంగా చెప్పడం లేదు. వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలి.

– సాయిలు, దరఖాస్తుదారు, గాంధారి

న్యాయం చేయాలి..



గొర్రెల యూనిట్ కోసం డబ్బులు చెల్లించి చాలా రోజులవుతోంది. గొర్రెలైనా ఇవ్వాలి లేదంటే డబ్బులైనా వాపస్ చేయాలని చాలాసార్లు అధికారులను కోరాం. కొత్త ప్రభుత్వమైనా న్యాయం చేయాలి.

– రాములు, దరఖాస్తుదారు, గాంధారి

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



గొర్రెల యూనిట్లు రాని వారి విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వడం గానీ, యూనిట్‌లు గ్రౌండ్ చేయడం గానీ చేస్తాం.

– సింహారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, కామారెడ్డి



కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద బారులు తీరిన ప్రజలు

'గృహజ్యోతి' కష్టాలు

- చాలామందికి వర్తించని జీరో బిల్
- మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు పరుగులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం ద్వారా చాలామందికి లబ్ధి చేకూరడం లేదు. జీరో బిల్ రానివారంతా మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించేవారికి జీరో బిల్లు ఇవ్వనుంది. దీనికోసం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఈనెలనుంచి పథకం అమలులోకి వచ్చింది. అయితే చాలామందికి జీరో బిల్ రావడం లేదు. దీంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తున్నారు. కామారెడ్డి పట్టణవాసులు బల్దియా కార్యాలయం వద్దకు వెళ్తున్నారు. 49 వార్డులకు సంబంధించి ఒకేచోట దరఖాస్తులు స్వీకరిస్తుండడంతో భారీ క్యూ కనిపిస్తోంది. వార్డుల్లో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కౌంటర్లు ఏర్పాటు చేయాలి



ప్రజాపాలనలో అన్ని పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. గృహజ్యోతి పథకం మాకు అమలు కాలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటే మూడు రోజులుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. వందలాది మంది క్యూలో ఉంటున్నారు. వార్డుల వారీగా ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– కాసర్ల రాధ, రాజకిషన్, దేవునిపల్లి



'జహీరాబాద్'లో తేలిన ప్రత్యర్థులు

- బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పేరు ప్రకటన
- ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థిత్వాలు ఖరారు

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థుల లెక్క తేలింది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించగా.. తాజాగా బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి పేరు ఖరారైంది. గాలి అనిల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు బీఆర్ఎస్ ప్రకటించింది. బీఆర్ఎస్‌నుంచి పోటీ చేసి గెలిచిన ఎంపీ బీబీ పాటిల్ కారు దిగి కమలం గూటికి చేరిన తర్వాత రాజకీయ లెక్కలు మారాయి. బీబీ పాటిల్‌కు బీజేపీ టికెట్టు కేటాయించగా.. అభ్యర్థి కోసం బీఆర్ఎస్ నాయకత్వం జల్లెడ పట్టాల్సిన పరిస్థితి వచ్చింది. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ముగుడంపల్లి మండలం మాడ్గి గ్రామానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించింది. గాలి అనిల్‌కుమార్ పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థిరపడ్డారు. కాగా బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. బీబీ పాటిల్ 2014, 2019 లలో వరుసగా ఎంపీగా గెలుపొందగా.. సురేశ్ షెట్కార్ 2009లో ఎంపీగా ఉన్నారు. బీబీ పాటిల్ వరుసగా మూడోసారి గెలిచి, హ్యాట్రిక్



సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రధాని నరేంద్రమోదీ చరిష్మా, అయోధ్యలో రామమందిర నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో బీజేపీ హవా కొనసాగుతోందని భావిస్తున్న ఆయన తనను నియోజకవర్గ ప్రజలు మరోసారి గెలిపిస్తారన్న నమ్మకంతో ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుండడం తన విజయానికి దోహదపడతాయని సురేశ్ షెట్కార్ భావిస్తున్నారు. రాష్ట్రంలో ఓడినా బీఆర్ఎస్‌కు ఊరూరా ఉన్న క్యాడర్, నాయకులను సమన్వయం చేసి కలిసి కట్టుగా పనిచేస్తే గెలుపు తనదేనన్న ధీమాతో గాలి అనిల్‌కుమార్ ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల లెక్క తేలడంతో నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కనున్నాయి.

నిజామాబాద్ అభ్యర్థిగా బాజిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను నిజామాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ ప్రకటించింది. సిరికొండ మండలం చీమన్‌పల్లికి చెందిన ఆయన కాంగ్రెస్ నుంచి రెండు సార్లు(ఆర్మూర్, బాన్సువాడ), బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు(నిజామాబాద్ రూరల్) ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆర్టీసీ చైర్మన్‌గా కూడా పనిచేశారు.

పంటలకు భరోసా!

- పీఎం ఫసల్ బీమా యోజన అమలుకు రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు
- వచ్చే వానాకాలం నుంచి అమలయ్యే అవకాశం

కామారెడ్డి క్రైం: ఆరుగాలం కష్టపడే రైతుకు పంట చేతికొచ్చే దాకా గ్యారంటీ లేదు. అకాల వర్షాలు, వరదలతో పంటకు భరోసా లేదు. ఇలాంటి కష్టాల నుంచి రైతును గట్టెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని నిర్ణయించింది. వచ్చే వానాకాలం నుంచి పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన రైతుల వాటా ప్రీమియంను కూడా తానే చెల్లించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఈ పథకం కింద వరదలు, అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే వ్యవసాయ అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు విచారణ జరిపి పంట నష్టాలను అంచనా వేసేవారు. జరిగిన నష్టం నుంచి 60 శాతం వరకు పరిహారం విడుదలయ్యేది. 2020 తర్వాత ఈ పథకాన్ని గత ప్రభుత్వ పాలకులు నిలిపి వేశారు.

జిల్లాలో 3.16 లక్షల మంది రైతులు

కామారెడ్డి జిల్లాలో మొత్తం 3.16 లక్షల మంది రైతులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి దేశవ్యాప్తంగా పీఎం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తుంది. తెలంగాణలో 2020 వరకు అమలు చేశారు. ఆ తర్వాత ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. అప్పటి నుంచి పంటలకు ఏదైనా నష్టం వాటిల్లితే పరిహారం అందడం లేదు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు సమస్యలపై దృష్టి పెట్టింది. వర్షాభావం, అకాల వర్షాలు, వరదల కారణంగా యేటా రాష్ట్రంలోని చాలా చోట్ల రైతులు పంట నష్టానికి గురవుతున్నట్లుగా గుర్తించారు. రైతులకు భరోసా కల్పించడం కోసం కొత్తగా పంటల బీమా పథకాన్ని రూపొందించాలని ముందుగా భావించారు. అనేక అధ్యయనాల తర్వాత కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకంలో భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రివర్గం ఇటీవలే నిర్ణయించింది. వచ్చే వానాకాలం నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

గతంలో నాలుగు పంటలకు..

ఫసల్ బీమా ప్రీమియం విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. గతంలో రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే సమయంలో రైతు వాటా కట్ చేసుకుని ఈ పథకాన్ని అమలు చేసేవారు. ప్రస్తుతం అన్నదాతల తరపున వాటా ధనాన్ని ప్రభుత్వమే చెల్లించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా పండించే వరి, మొక్కజొన్న, సోయా, కంది పంటలకు 2020కు ముందు ఫసల్ బీమా అమలయ్యేది.

మిగతా పంటలకు వర్తించేది కాదు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ పథకాన్ని అన్ని రకాల పంటలకు వర్తింపజేస్తోంది. ఆయా రాష్ట్రా లు తాము ఇవ్వాల్సిన రాయితీలు, రైతుల తరఫున చెల్లించాల్సిన ప్రీమియం ఖర్చులను బేరీజు వేసుకుని ఆయా ప్రాంతాల్లో పండే ప్రధాన పంటలకు వర్తింపజేస్తున్నాయి. మన రాష్ట్రంలో ఏయే పంటలకు అమలు చేయనున్నారో వేచి చూడాలి. విధివిధానాలు ఇంకా విడుదల కాలేదు.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



వచ్చే వానాకాలం నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రాలేదు. జిల్లాలో 3.16 లక్షల మంది రైతులు ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చూస్తాం.

– భాగ్యలక్ష్మి, డీఏవో, కామారెడ్డి

'గుర్తింపు'పై నిర్లక్ష్యం!

- వర్సిటీ అనుబంధ గుర్తింపు తీసుకోని పలు కాలేజీలు
- ఉన్నత విద్యాశాఖకు లేఖ రాయనున్న వర్సిటీ అధికారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కొన్ని అనుబంధ కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వర్సిటీ పరిధిలో 73 అనుబంధ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటికి ప్రతియేటా వర్సిటీ అనుబంధ గుర్తింపు ఇస్తుంది. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో దాదాపు 22 కళాశాలలు ఇప్పటికీ వర్సిటీ అనుబంధ గుర్తింపు ఉత్తర్వులను తీసుకోలేదు. ఇందులో ప్రముఖ ప్రైవేటు కళాశాలలతో పాటు మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని సమాచారం. డిగ్రీ ప్రవేశాల సమయంలో యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ఉత్తర్వును ప్రతి కళాశాల దోస్త్ వెబ్‌సైట్‌తో పాటు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం సంబంధిత కార్పొరేషన్‌లకు



తెయూ పరిపాలనా భవనం

సమర్పించాల్సి ఉంటుంది. అయితే 22 కళాశాలలు ఇప్పటికీ తమ అనుబంధ గుర్తింపు ఉత్తర్వులను వర్సిటీ నుంచి తీసుకోలేదు. దీంతో విద్యార్థుల సంక్షేమం పట్ల వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలుస్తోందని విమర్శలు వస్తున్నాయి.

నోటీసులు ఇచ్చి..

సాధారణంగా ప్రవేశాలకు ముందే కాలేజీల్లో యూనివర్సిటీ అధికారులు తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే గతేడాది ఈ సమయంలో అప్పటి వీసీ రవీందర్‌కు తన అవినీతి వ్యవహారం తలనొప్పిగా మారడంతో.. తనిఖీలు లేకుండానే కళాశాలల్లో ప్రవేశాలు కల్పించారు. తర్వాత జూలై 2023లో ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా ఘంటా చంద్రశేఖర్ నియామకమయ్యారు. దోస్త్ అడ్మిషన్లు పూర్తయిన తర్వాత సెప్టెంబర్ 11 నుంచి వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో అనుబంధ గుర్తింపు తనిఖీలు చేపట్టారు. అప్పటికే అడ్మిషన్లు పూర్తవడంతో కనీస వసతులు లేని కొన్ని కాలేజీలకు నోటీసులు ఇచ్చి అనుబంధ గుర్తింపు ఇచ్చారు. అలాగే కళాశాలల్లో పని చేస్తున్న బోధన సిబ్బందికి వర్సిటీ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అయితే వర్సిటీ అధికారులు కొన్ని కళాశాలలకు సుమారు 15 ఏళ్లుగా టీచింగ్ స్టాఫ్ అప్రూవల్ నామమాత్రంగా ఇస్తున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు సమర్పించిన స్టాఫ్ అక్కడ నిజంగా పని చేస్తున్నారో లేదో తెలియదు. ఈ విద్యా సంవత్సరంలో అన్ని అనుబంధ కళాశాలల స్టాఫ్ అప్రూవల్స్ కొత్తగా చేయాలని ఆడిట్ సెల్ అధికారులు భావించారు. అయితే ఈ సారికి రెన్యువల్ చేయాలని వచ్చే విద్యాసంవత్సరంలో కొత్త అప్రూవల్స్‌కు వెళ్తామని కళాశాలల యాజమాన్యాలు విన్నవించడంతో రిజిస్ట్రార్ అనుమతించారు.

కళాశాలలకు వెబ్‌సైట్స్ లేవు

యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాలలు వెబ్‌సైట్‌ను మెయింటెయిన్ చేయాల్సి ఉంటుంది. ఇందులో విద్యార్థులు, స్టాఫ్ వివరాలు, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే తెయూ పరిధిలోని పలు కళాశాలలకు ఇప్పటికీ వెబ్‌సైట్స్ లేవు. ఈ విషయమై వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా సంబంధిత కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. యూజీసీ నిబంధనలు పాటించకుండా, అనుబంధ గుర్తింపు ఉత్తర్వులు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్న కళాశాలల వివరాలను వచ్చే విద్యాసంవత్సరంలో దోస్త్ వెబ్‌సైట్‌లో పెట్టవద్దని కోరుతూ వర్సిటీ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సమాచారం. అలా అయితే పలు కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు లేకుండా పోయే అవకాశం ఉంది. అలాగే ఈ సారి ఏప్రిల్ మొదటివారం నుంచే అనుబంధ గుర్తింపు కోసం వర్సిటీ పరిధిలోని కళాశాలల తనిఖీలు చేపట్టేందుకు ఆడిట్ సెల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సెమీ కండక్టర్ల తయారీలో భారత్ ముందంజ

తెయూ(డిచ్‌పల్లి): 'వికసిత్ సంకల్ప్ భారత్' కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ రూ. 1.25 లక్షల కోట్ల విలువైన మూడు సెమీకండక్టర్ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని తెలంగాణ యూనివర్సిటీలోని సెమినార్ హాల్లో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువతను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. స్వదేశీ పరిజ్ఞానంతో సెమీ కండక్టర్ రంగంలో భారతదేశం ముందంజలో ఉండడం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో సెమీకండక్టర్ డిజైన్, తయారీ, సాంకేతిక అభివృద్ధితో భారతదేశాన్ని గ్లోబల్ హబ్‌గా మారుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రొఫెసర్లు నసీం, లావణ్య, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 16న శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నిజా మ్యాన్‌పవర్, కళాశాల టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో సోలార్, ఎలక్ట్రికల్ కంపెనీల్లో ఉద్యోగాలకు మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి సబ్సిడీ క్యాంటీన్, హాస్టల్ వసతి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు అకాడమిక్ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, బయోడెటాతో హాజరు కావాలని సూచించారు.వివరాల కోసం 8639514294, 9440356276 నంబర్లను సంప్రదించాలన్నారు.

23న బాన్సువాడ తైబజార్ వేలం

బాన్సువాడ: బాన్సువాడ తైబజారుకు ఈ నెల 23న వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అలీం తెలిపారు. వారాంతపు సంత, రోజు వారి సంత, పశువుల దాఖలు, మేకలు, గొర్రెల సంతకు వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార సంతకు పాటలో పాల్గొనే వారు రూ.2.50 లక్షల డీడీ తీయాల్సి ఉంటుందని, రోజు వారి సంతకు రూ.రెండు లక్షలు, పశువుల దాఖలుకు రూ.50 వేలు, మేకలు, గొర్రెల సంతకు రూ.3 లక్షల డీడీలు తీయాలని వివరించారు. డిపాజిట్ చెల్లించిన వారే వేలం పాటలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

గ్రంథాలయాన్ని పరిశీలించిన ఆర్డీవో



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో గ్రంథాలయాన్ని ఆర్డీవో ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. గ్రంథాలయంలో రీడర్లకు సరిపడా వసతులు లేవని స్థానికులు ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే సూచనల మేరకు ఆర్డీవో పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యల గురించి ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక పంపి పాఠకులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలను తీసుకుంటామని అన్నారు. తహసీల్దార్ మహేందర్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుర్మ సాయిబాబా తదితరులున్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



దోమకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని డీఈవో రాజు అన్నారు. బుధవారం మండలంలోని లింగుపల్లి, ముత్యంపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ముత్యంపేట ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణు తదితరులు ఉన్నారు.

'అమ్మాయిగారు' నవల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి: మండలంలోని సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన యువకుడు నాయికోటి చందు రచించిన నవలను ఆర్టిస్టులు రాకెట్ రాఘవ, తాగుబోతు రమేష్, నూకరాజు, ఇమాన్యుల్, శాంతి, వెంకి బుధవారం ఆవిష్కరించారు. చందును గ్రామస్తులు అభినందించారు.

పాఠశాలల్లో మోగిన సమ్మె సైరన్

- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రూ.12కోట్ల బకాయిలు
- ఇబ్బందుల్లో కార్మికులు
- 2023 నవంబర్ నుంచి విడుదల కాని నిధులు



మోర్తాడ్‌లో సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు

మోర్తాడ్(బాల్కొండ): మధ్యాహ్న భోజన ఏజెన్సీల బకాయిలు పేరుకుపోవడంతో కార్మికులు పాఠశాలల్లో మరోసారి సమ్మె సైరన్ మోగించారు. 2023 నవంబర్ నుంచి ఇప్పటి వరకు రూ.12 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, తాము ఎలా వంట చేసి పెట్టాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం మధ్యాహ్న భోజనం పెట్టలేదు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించినప్పటికీ.. కొత్త బిల్లులను జమ చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,079 ఉన్నాయి. 2023 అక్టోబర్ వరకు బకాయి బిల్లులు మొత్తం రూ.10 కోట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడతల వారీగా చెల్లించింది. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులను చెల్లించినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కనీసం రెండు నెలలకు ఒకసారైనా బిల్లులు జమ చేసి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతేడాది డిసెంబర్ నుంచి మధ్యాహ్న భోజనం కోడిగుడ్లు వడ్డించడాన్ని కార్మికులు నిలిపివేశారు. కేవలం పప్పు, కూరగాయల భోజనంతోనే సరిపెట్టారు. ఇప్పటికే ఏజెన్సీలకు బకాయిలు భారీగా పేరుకపోవడంతో సమ్మె చేయక తప్పడం లేదని కార్మికులు చెబుతున్నారు. బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించాలి. ఏజెన్సీల నిర్వాహకుల్లో పేద, మధ్య తరగతివారే ఉన్నారు. ప్రతినెలా బిల్లులు చెల్లిస్తేనే ఏజెన్సీలను కొనసాగించడం సాధ్యమవుతుంది. నెలల తరబడి బిల్లులు జమ చేయకపోతే కార్మికుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.
– చక్రపాణి, మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఘం నాయకుడు

దేశాభివృద్ధిలో మహిళలే కీలకం


జెడ్పీ సీఈవో ఉషను సన్మానిస్తున్న మహిళలు

నిజామాబాద్‌నాగారం: దేశాభివృద్ధిలో మహిళలే కీలకమని, అన్ని రంగాల్లో రాణించినప్పుడే అది సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి ఉష అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని బస్వాగార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఈవో ఉష మాట్లాడుతూ.. మహిళలు వివక్షను అధిగమించి శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రసూల్ బి మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా సమాజ హితం కోసం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో కన్వీనర్ పద్మశ్రీ, తెయూ ప్రొఫెసర్ ఆరతి ప్రసంగించారు. ట్రెజరరీ డిప్యూటీ డైరెక్టర్ దశరథ్, వెల్‌నెస్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, నూర్జహాన్, శోభ, పుష్పవల్లి, దీన సుజన, బేబీ, మేరీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు


అవంతి

బోధన్: వరంగల్ జిల్లాకు చెందిన సాగంటీస్ ఆర్ట్ అకాడమీ 'ఓరుగల్లు కళా వైభవం' పేరుతో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చిత్ర కళాపోటీలో బోధన్‌కు చెందిన విద్యార్థిని అవంతి ప్రతిభ కనబర్చి బెస్ట్ ఆర్టిస్ట్ అవార్డు అందుకుంది. మూడురోజుల క్రితం ఆన్‌లైన్‌లో పోటీలను నిర్వహించగా, పట్టణంలోని తట్టికోట కాలనీకి చెందిన అవంతి గీసిన నంది చిత్రాన్ని అవార్డుకు ఎంపిక చేశారు. అవంతి ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది.

పరీక్షలంటే భయం వీడాలి



నాగిరెడ్డిపేట: పదోతరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని ఎంఈవో ఏ వెంకటేశం సూచించారు. మండలంలోని ఆత్మకూర్ హైస్కూల్‌లో బుధవారం పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. హెచ్ఎం మహ్మద్ అబ్దుల్ జమీన్ పాల్గొన్నారు.

షాపింగ్ మాల్ సెల్లార్ సీజ్

- కోర్టు ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపల్ అధికారుల చర్యలు


షాపింగ్‌మాల్ సెల్లార్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: మున్సిపాలిటీ అనుమతులు లేకుండా జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిర్మించిన ఓ షాపింగ్ మాల్‌పై మున్సిపల్ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సుజాత, టీపీవో గిరిధర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖ సమక్షంలో భవనం సెల్లార్‌తోపాటు నాలుగో అంతస్తును సీజ్ చేశారు. రెండేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు సీజ్ చేసినప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చి తొలగించారనే ఆరోపణలున్నాయి. తాజాగా హైకోర్టు ఆదేశాల మేరకు రెండో సారి సీజ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్డులో అనుమతులు లేని సెల్లార్లు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయని, వాటిపై సైతం చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. టీపీఎస్ రాజేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన



దోమకొండ: విద్యార్థులు సమాచార, విద్యాహక్కు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని స.హ. చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శివరాములు, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యాసంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి అలివేలు ఒక ప్రకటనలో కోరారు. www. tswreis. ac. in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. మిగిలిన సీట్ల భర్తీకి ఏప్రిల్ 21న బీఎల్‌వీసెట్ –2024 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని ఆర్‌సీవో తెలిపారు.

సైన్స్ టీచర్‌కు ప్రధాని అభినందన

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో భౌతిక, రసాయన శాస్త్రం బోధిస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు ప్రధాని మోదీ నుంచి అభినందన పత్రం అందింది. గతంలో ప్రధాని ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్ పాల్గొని సలహాలు సూచనలను అందించారు. దీనికి గాను ఆయనను అభినందిస్తూ ప్రధానమంత్రి లేఖ పంపించారు.

'నాగర్‌కర్నూల్‌లో ప్రచారం చేస్తాం'



కొత్తగా నియామకమైన బీఎస్పీ ప్రతినిధులను అభినందిస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తున్నందున అక్కడికి వెళ్లి ప్రచారం చేయాలని జిల్లా కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. బుధవారం జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బి బాల్‌రాజు హాజరై మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఈ నెల 15న కాన్షీరాం జయంతి వేడుకలు ని యోజకవర్గాల స్థాయిలో నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈ సాయిలు, ఉపాధ్యక్షుడిగా ఎన్ జీవన్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. డి సురేష్, శమంత, ఈ రోహిదాస్, ఎం సాయిబాబా, కుమార్ పాల్గొన్నారు.

నిరసన తెలిపేవారు అనుమతి తీసుకోవాలి

- నూతన ధర్నా చౌక్ కోసం స్థలం కేటాయింపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


ధర్నా చౌక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

సుభాష్‌నగర్: ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు నూతన ధర్నా చౌక్‌కోసం జిల్లా కేంద్రంలో వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయించామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. నిరసనలు తెలిపేవారు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. నగరంలోని నూతన ధర్నా చౌక్ స్థలాన్ని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త కలెక్టరేట్ వద్ద, పాత కలెక్టరేట్ ప్రధాన రోడ్డుకు ఆనుకుని నిరసనలు నిర్వహిస్తుండటం రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా ధర్నా చౌక్ కోసం పాత కలెక్టరేట్ ఎదుట స్థలాన్ని కేటాయించామన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ముందస్తు అనుమతితో కొత్తగా ఏర్పాటు చేసిన ధర్నా చౌక్‌లోనే నిరసనలు తెలుపాలని సూచించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఆర్డీవో రాజేంద్రకుమార్, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సౌత్ తహసీల్దార్ బాలరాజు తదితరులున్నారు.

ఆహార కల్తీ నిరోధానికి కృషి

- అధికారులను అప్రమత్తం చేస్తాం
- వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి
- జిల్లా నూతన కమిటీ ప్రకటన



మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆహార కల్తీని నిరోధించేందుకు నిరంతరం కృషి చేస్తామని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. వినియోగదారుల సంక్షేమ సమితి ఇందూరు కమిటీని చక్రపాణి బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హానికరమైన రసాయనాలతో పాలు, ఇతర ఆహార పదార్థాల కల్తీ విషయమై సంబంధిత శాఖ నిర్లక్ష్యం చేస్తే వినియోగదారుల మండలి ద్వారా అనునిత్యం అప్రమత్తం చేస్తామన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి నూతన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పెండోట అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా వీఎస్ వర్మ, ప్రధాన కార్యదర్శిగా సందు ప్రవీణ్, కోశాధికారిగా మహదేవ్ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా కె.సాయికుమార్, పి.ప్రవళిక, కార్యవర్గ సభ్యులుగా బాణోత్ సందీప్ నియమితులైనట్లు పేర్కొన్నారు. వినియోగదారుల సమస్యలు, నాసిరకం ఔషధాలు, తూనికలు, కొలతల్లో మోసాలు, ఆహార కల్తీ, రసీదు లేని జీరో వ్యాపారం, హాల్ మార్కింగ్ విధానం, వెండి ఆభరణాల్లో సగం శాతం వరకు కల్తీ, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, కల్తీ విత్తనాలు, పురుగు మందులు, విచ్చలవిడి మైనింగ్ వల్ల పర్యావరణ సమస్యలు తదితర అంశాలపై చైతన్యపరిచే కార్యక్రమాలను కొత్త కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెండోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో వినియోగదారుల క్లబ్బులు, స్టాండర్డ్స్ క్లబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య వంతులను చేస్తామన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు


ఎల్లారెడ్డిలో పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు


గోపాల్‌పేటలో..

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన కెమిస్ట్రీ పరీక్షకు 8,347 మందికిగాను 8,021 మంది విద్యార్థులు హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 1,463 మందికి గాను 1,298 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం తనిఖీ చేశారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ


నిఖిత


శివాంజలి


మానస

కామారెడ్డి టౌన్: తెలంగాణ యూనివర్సిటీ పరిధి డిగ్రీ ఫలితాల్లో ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్ నికిత బయోటెక్నాలజీ రెండో సంవత్సరంలో 9.88 జీపీఏ మార్కులు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకును సాధించింది. అలాగే బీకాం ఫస్ట్ ఇయర్‌లో శివాంజలి 9.56, బీఎస్సీ డేటా సైన్స్ సెంకండ్ ఇయర్‌లో మానస 9.56, బీఎస్సీ హానర్స్‌లో శివగణేష్ ఫస్ట్ ఇయర్‌లో 9.56 జీపీఏ మార్కులు సాధించారు. అలాగే సృజన, సాయి శిరీష, మనీషా, పూజిత ఉత్తమ మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాద్రి, లెక్చరర్లు అభినందించారు.

విశిష్ట కళాశాల విద్యార్థుల సత్తా..

విశిష్ట కళాశాల విద్యార్థులు సలేహా మతీన్ 9.60, అస్మా, సల్మాఫాతిమా 9.56, జావేరియా, నిధాలు 9.52 జీపీఏ మార్కులు సాధించి ప్రతిభ చాటారు. విద్యార్థులను కళాశాల యజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

మొరం క్వారీపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 21 టిప్పర్లు, రెండు జేసీబీలు సీజ్

మాక్లూర్: మండలంలోని సింగంపల్లి శివారులో అక్రమంగా కొనసాగుతున్న మొరం క్వారీపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి మొరం క్వారీపై దాడి చేసి 21 టిప్పర్లు, రెండు జేసీబీలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో సిబ్బంది లక్ష్మన్న, సుదర్శన్, రాజేశ్వర్, రాములు, గజేందర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


టిప్పర్ పట్టివేత..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఊట్‌పల్లి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. టిప్పర్‌ను సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు.

క్రైం కార్నర్

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

మాచారెడ్డి: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాల్వంచ మండలం మంథని దేవునిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ముద్దంగుల నర్సింలు(27)కు ఐదు సంవత్సరాల క్రితం రామేశ్వర్పల్లికి చెందిన దివ్యతో వివాహమైంది. గొడవల కారణంగా ఆరు నెలల క్రితం దివ్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన నర్సింలు మంగళవారం రాత్రి ఇంట్లోని దూలానికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న వృద్ధురాలు..

మాక్లూర్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని ముల్లంగి(బి)కి చెందిన నీరడి సాయమ్మ(74) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. కోడలు నీరడి సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలుకింద పడి యువకుడు..

కామారెడ్డి క్రైం/భిక్కనూరు: కుటుంబ కలహాల కారణంగా రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్కనూరు – అక్కన్నపేట రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్ జిల్లా రామాయంపేట మండలం తోనిగండ్ల గ్రామానికి చెందిన పుర్ర ప్రవీణ్(26) లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేసేవాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ప్రవీణ్ మంగళవారం రాత్రి గుర్తు తెలియని రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులను విచారించగా, కుటుంబ కలహాలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తావూ నాయక్ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి



భిక్కనూరు: చేపల వేటకు వెళ్లిన యువకుడు మండల కేంద్రంలోని బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు. దినసరి కూలీగా పనిచేసే వేణుగోపాల్(35) బుధవారం బొబ్బిలి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగాడు. అక్కడే ఉన్న వారు గమనించి వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కొద్దిసేపటి తరువాత మృతదేహం పైకి తేలడంతో చెరువులోనుంచి బయటికి తీశారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన మునిగేపల్లి కృష్ణవేణి (21) అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం నుంచి తన కూతురు కనిపించడం లేదని తండ్రి రాజయ్య ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో టిఫిన్ సెంటర్, ఇల్లు దగ్ధం


ముత్యంపేటలో దగ్ధమైన టిఫిన్ సెంటర్ సామగ్రి

దోమకొండ/రుద్రూర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దోమకొండ మండలం ముత్యంపేట, పొతంగల్ మండలం హెగ్డోలిలో బుధవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ముత్యంపేటకు చెందిన తమ్మిడి నరేశ్‌కు చెందిన టిఫిన్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం కారణంగా రూ.2లక్షల విలువైన సామగ్రి దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు. పొతంగల్ మండలం హెగ్డోలిలో మల్లికార్జున్‌కు చెందిన ఇంట్లో ఫర్నిచర్ దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.లక్షా72వేల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఆటోబోల్తా.. మహిళలకు గాయాలు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట నుంచి ఠాణాకలాన్ వైపు వెళ్తున్న ఆటో పంది అడ్డురావడంతో రతన్‌కుంట వద్ద ప్రధాన రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలకు గాయాలయ్యాయి. బాధిత మహిళలను స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ పట్టణ శివారులోని శ్రీనివాస్ క్యాంప్ సమీపంలో అతివేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంగా నడపడంతోనే ట్రాక్టర్ పంట పొలాల్లోకి దూసుకెళ్ళిందని స్థానికులు తెలిపారు. ప్రమాదసమయంలో ఎదురుగా వాహనలు, వ్యక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని వారు పేర్కొన్నారు.